క్లుప్తంగా

అండర్ డ్రైయినేజీ నిర్మించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ పట్టణంలో అండర్ డ్రైయినేజీని నిర్మించి మురుగు కాల్వల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో రెండో పెద్ద పట్టణంగా ఉన్న ఘన్‌పూర్‌లో డ్రైయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, అధికారుల నిర్లక్ష్యంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే స్పందించి సమస్యల్ని పరిష్కరించాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



జనగామ: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జనగామ టౌన్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ ఇస్మాయిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. జనరల్ సెక్రటరీగా సయ్యద్ జబ్బార్, కోశాధికారిగా అఫ్జల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మైనారిటీ చైర్మన్ జఫర్ షరీఫ్, హర్షద్ ఉల్ రహమాన్, ఖాదర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పాలకుర్తి : మండలంలోని వల్మిడిలో ఇటీవల గంట పిచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా శనివారం మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు గంట రవీందర్ ఆధ్వర్యంలో రూ.7,500 సాయం, బియ్యం అందజేశారు. ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీరటి చంద్రయ్య తదితరలు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ కోరారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


జనగామ రూరల్: పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తప్పని సరిగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దపహాడ్ కళ్యాణ్ నగర్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటువ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏరియా గోపాల మిత్ర సూపర్‌వైజర్ జైపాల్‌రెడ్డి, ఎల్ఎస్ఏ హఫీజ్, అబ్బయ్య, నర్సింహులు పాల్గొన్నారు

బీఆర్‌ఎస్‌లో చేరిక



జనగామ: పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పారుపాటి శ్రీనివాస్‌రెడ్డి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో శనివారం మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన మిలియన్ మార్చ్‌లో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని జైలుకు వెళ్లారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఆయన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నట్లు చెప్పారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం చెందడంతోనే గులాబీ కండువా కప్పుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట 500 మంది అనుచరులు ఉన్నట్లు స్పష్టం చేశారు.

కేసీఆర్‌ను కలిసిన గిరిజన నాయకులు



దేవరుప్పుల: బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మండల గిరిజన నాయకులు శనివారం ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో కలిశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధారావత్ రామ్‌సింగ్, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మాజీ సర్పంచ్ రాజన్న తదితరులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే షురూ



కొడకండ్ల: సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుశీల



దేవరుప్పుల: కోలుకొండలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న డీఈఓ రాము



తరిగొప్పుల: సర్వే సరళిని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగేశ్వరాచారి



జఫర్‌గఢ్: సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్

కొడకండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఉదయం 10 గంటల నుంచే ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లలో సర్వేను ప్రారంభించారు. 75 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సర్వేలో నమోదు చేయాల్సి ఉండడంతో ఒక్కో ఇంట్లో సర్వే పూర్తవడానికి కుటుంబసభ్యులను బట్టి అరగంట దాకా సమయం పడుతోంది. కొడకండ్లలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండగడప సుశీల పరిశీలించి సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అలాగే తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఎంపీడీఓ నాగశేషాద్రి సూరిల పర్యవేక్షణలో తొలి రోజు 602 గృహాల్లో సర్వే చేపట్టారు.

పారదర్శకంగా సమాచారం నమోదు చేయండి

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇంటింట కుటుంబ సమగ్ర సర్వేను పారదర్శక సమాచారంతో నమోదు చేయాలని డీఈఓ, మండల ప్రత్యేకాధికారి కె.రాము సూచించారు. శనివారం మండలంలోని కోలుకొండ, అప్పిరెడిపల్లె, చిన్నమడూరులో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించి ఎన్యూమనేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత కుటుంబాల సర్వే పూర్తి చేసేందుకు ఆయా గ్రామాల్లోని సూపర్‌వైజర్లు నిరంతర పర్యవేక్షణ చేయాలనీ, ప్రజల సందేహాలను నివృత్తి చేసి సమగ్ర కుటుంబ సర్వే సకాలంలో పూర్తి చేసేలా అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌పీ గోలి తిరుపతిరెడ్డి, సూపర్‌వైజర్లు ఉన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. సర్వే సరళిని తహసీల్దార్ నాగేశ్వరాచారి, ఎంపీడీఓ దేవేందర్ రెడ్డి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 37 మంది ఎన్యుమరేటర్స్ ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి వివరాల సేకరించారు. ఒక్కో ఎన్యుమరేటర్స్ 10 నివాస గృహాలకు సంబంధించి యజమానులు, వారి కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేశారు.



చిల్పూరు: సర్వేను పరిశీలిస్తున్న మాధవీలత

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర కుటుంబ సర్వే మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు ఇంటింటా సర్వే చేపట్టారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్, తహసీల్దార్ శంకరయ్య క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన సూచనలు చేశారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండలంలో సర్వేను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి మాధవీలత పరిశీలించారు. తహసీల్దార్ సరస్వతి ఆధ్వర్యంలో సర్వేను ప్రారంభించగా కొందరు ఆస్తుల వివరాలు, పార్టీల గురించి చెప్పడానికి నిరాకరించారు. అలాంటి వారిపై ఒత్తిడి చేయకుండా చెప్పిన వివరాలను ఎన్యుమరేటర్లు రాసుకున్నారు.

సర్వేను పరిశీలించిన ప్రత్యేక అధికారి

జనగామ రూరల్: మండలంలోని సిద్దెంకి, ఎల్లంల, పసరమడ్ల, పెంబర్తి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి నరేందర్, ఎంపీడీఓ సంపత్‌కుమార్ సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమినేటర్‌లు సర్వేలోని ప్రతి అంశాన్ని పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు.

మందకొడిగా సర్వే..

నర్మెట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో మందకొడిగా సాగుతోంది. ఎన్యుమరేటర్లు 41 మంది, పర్యవేక్షకులు నలుగురు, క్లస్టర్ అధికారులుగా ఎంపీడీఓ, తహసీల్దార్ వ్యవహరిస్తున్నారు. మండలంలో 6037 గృహాలకు స్టిక్కరింగ్ పూర్తికాగా శనివారం ఇంటింటి వివరాల సేకరణ ప్రారంభమైంది. మొదటిరోజు ఒక్కో ఎన్యుమరేటర్ 8 నుండి 10 కుటుంబాల వివరాలు సుమారుగా 375 సేకరించారు. కాగా మండలకేంద్రంతోపాటు హన్మంతాపూర్, గుంటూర్‌పల్లి, ఆగాపేట, ఇసుకబాయితండాలలో ప్రత్యేక అధికారి వైద్యం శ్రీకాంత్, తహసీల్దార్ సీహెచ్.రామానుజాచార్యులు, బి.అరవింద్ చౌదరి, ఆర్ఐ సిగసారపు సాయిబాబ సర్వేను పరిశీలించారు.



నర్మెట: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



స్టేషన్‌ఘన్‌పూర్: సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్, పరిశీలిస్తున్న ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి



జనగామ రూరల్: సిద్దెంకిలో..

ఒక్కో ఇంటికి 35 నిమిషాలు

లింగాలఘణపురం: మండలంలో 14,813 ఇళ్లు ఉండగా 95 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం మొదటి రోజు సమగ్ర కుల సర్వేలో ఒక్కొక్క ఇంటికి 35 నిమిషాల సమయం పడుతోంది. 56 ప్రశ్నలకు సంబంధించి ప్రతి ప్రశ్నకు తప్పకుండా కోడ్ వేయడం, అనుబంధ ప్రశ్నలు కూడ ఉండడంతో మొదటి రోజు ఎన్యూమరేటర్లు కొంత ఇబ్బంది పడ్డారు.


బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో సర్వేను అధికారులు చేపట్టారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులను అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు. జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్‌లు పలు గ్రామాల్లో పర్యటించి సర్వేలను పరిశీలించారు.

పల్లెల్లో సమగ్ర సర్వే సందడి

దేవరుప్పుల: పల్లెల్లో సమగ్ర కుటుంబ సర్వే సందడి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పలువురు జీవనోపాధి కోసం రాష్ట్ర రాజధాని, పలు జిల్లాలోకి వలస వెళ్లిన కుటుంబ సభ్యులు సర్వేలో పాల్గొనేందుకు వస్తున్నారు. భవిష్యత్‌లో సర్వే నమోదు లేకుంటే ప్రభుత్వ ఫలాలు రావేమోనన్న ఆందోళనతో తప్పక కుటుంబ వివరాలు చెప్పేందుకు వస్తుండడం గమనార్హం. కాగా, శనివారం సమగ్ర సర్వే ప్రారంభ దిశలో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ ఎన్యూమనేటర్లకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి దిశ, నిర్దేశాన్ని తెలిపారు. రోజుకు పది చేయాల్సి ఉండగా అత్యధికంగా ఎనిమిది చేసినట్టు సమాచారం.

కరాటేలో వంగాలపల్లి వాసికి కాంస్య పతకం



చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి గ్రామానికి చెందిన నూనె శివకుమార్ శుక్రవారం గోవాలో జరిగిన ఎఫ్ఎస్‌కేఏ వరల్డ్ చాంపియన్‌షిప్ కరాటే కటాస్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. కాగా, గ్రామానికి చెందిన శివకుమార్ కాంస్య పతకం సాధించడం పట్ల జీపీ కార్యదర్శి దంబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు ఆరూరి ప్రణితప్రదీప్, భూక్య సుధాకర్, గైరాజు, డాక్టర్ చిట్యాల దయాకర్, ఆరూరి రవిచంద్రలు అభినందించారు.

ఆపన్నహస్తం అందించడమే ధ్యేయం



నర్మెట: అవసరార్థులకు ఆపన్న హస్తం అందించడమే లయన్స్ క్లబ్ ధ్యేయమని సంస్థ జిల్లా పూర్వ గవర్నర్ లయన్ కన్నా పరశురాములు అన్నారు. పూర్వ అధ్యక్షుడు పబ్బా చంద్రశేఖర్ గుప్తా ఆర్థిక సహాయంతో లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలకు శనివారం బీరువా, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిస్వార్థ సేవ నినాదంతో 1917లో స్థాపించిన లయన్స్ అంతర్జాతీయ సేవాసంస్థ విశ్వవ్యాప్తంగా 210 దేశాలలో సేవలందిస్తూ ప్రత్యేకతను సంతరించుకున్నదని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు పి.నాగేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దూడల రమేశ్, ఉపాధ్యాయులు , విద్యార్థులు, లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐటీలో ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్, ప్రిన్సిపాల్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జనగామ: యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారితో కలిసి సంబురాలు చేసుకున్నారు. ఈ వేడుకల్లో కళాశాల డైరెక్టర్ డి.విజయాపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పైచదువులు కొనసాగిస్తూ, నిరంతరం కష్టపడుతూ సమాజం గర్వించే ఇంజనీర్లుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కళాశాలలో నేర్చుకున జ్ఞానాన్ని దేశాభివృద్ధి ఉపయోగించాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థుల ఆట, పాటలు అలరించాయి.

సంక్షిప్త సమాచారం

రిజర్వాయర్లు నిర్మించాలి

బచ్చన్నపేట: నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం రిజర్వాయర్లను నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. మిన్నాలపురం ఎల్లయ్య, రావుల రవీందర్‌రెడ్డి, బైరగోని రాములు, రాజు, రాములు, ఎల్లయ్య, ఈదమ్మ, లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.


ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పాలకుర్తి: కులగణన సర్వేలో తెలంగాణ ఉద్యమ తొలి, మలి దశ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంఘం రాష్ట్ర నాయకుడు నలమాస రమేశ్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల స్థలంలో ఇల్లు నిర్మించి పింఛన్ సదుపాయం కల్పించాలని అన్నారు. నాయకులు వెంకన్న, అనుముల అంజిరావు, నారగోని ఎల్లయ్య, ఎడవెల్లి దండయ్య, జోగు పరశరాములు, బోరెడ్డి మల్లారెడ్డి, నేపాల్ నాయక్ ఉన్నారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని రామన్నగూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గున్నాల రాంచంద్రారెడ్డి(60) శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. గ్రామాభి వృద్ధికి ఎంతో కృషిచేసిన అతని మృతి పట్ల గ్రామస్తులు నివాళులర్పించారు.

బాధితులను ఆదుకోవాలి



జనగామ రూరల్: పట్టణంలో విజయ షాపింగ్ మాల్‌లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం కారణంగా చుట్టుపక్కల నష్టపోయిన షాపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపీ, వ్యాపారులు స్వర్ణం శ్రీనివాస్, స్రవంతిచ బెలిదె రాజశేఖర్, పిట్టల విశ్వనాథం, వీరమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్న కన్నెబోయిన రమేశ్ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా, శనివారం బాధిత కుటుంబాన్ని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఉపాధ్యాయులు పరామర్శించి రూ.10వేల సాయం అందజేశారు. యాదవ సంఘం పెద్ద గొల్ల సలేంద్ర సోమన్న, గ్రామస్తులు ఉన్నారు.

చుక్క సత్తయ్య వర్ధంతి



బచ్చన్నపేట: ఒగ్గు కథ కళా సామ్రాట్ డాక్టర్ చుక్క సత్తయ్య వర్ధంతిని మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు ఎనుగుల కనుకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిడి సిద్దులు, కుమార్, పోషయ్య పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

తరిగొప్పుల: మండల కేంద్రంలోని సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (తల్లి సంఘం) 122వ వార్షికోత్సవ వేడుకలు సంఘ కాపరి చింతల కర్ణాకర్, సంఘ పెద్ద కాత దేవానందం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బేతేలు మిరాకిల్ చర్చి పాస్టర్ ఎం.పాల్ డేవిడ్ ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొని వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేఎం జాన్ జయమణి, సంఘ కోశాధికారి ఎడ్ల నవీన్‌కుమార్, సంఘస్థులు, పెద్దలు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

లింగాలఘణపురం: చీటూరులో ఐల యాదయ్య (63) జీవితంపై విరక్తితో ఈ నెల 7న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆకతాయిపై ఫిర్యాదు

లింగాలఘణపురం: మండలంలోని కొత్తపల్లిలో ఓ ఆకతాయి వ్యక్తి చేష్టలతో ఇబ్బందిపడిన మహిళ అతనిపై పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం . సదరు మహిళ స్నానం చేస్తున్న సమయంలో ఎదురింటి వ్యక్తి కిటికిల్లోంచి చూడడం. అది గమనించిన మహిళ కుటుంబ సభ్యులకు తెలుపగా ఆ వ్యక్తి దురుసుగా మాట్లాడినట్లు తెలిసింది. దీంతో మహిళ కుటుంబ సభ్యులు సదరు వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి వేడుకలు



జనగామ: గోవులకు పూజలు చేస్తున్న భక్తులు



పాలకుర్తి: గోమాతకు హారతి ఇస్తున్న మహిళ

జనగామ: జిల్లా కేంద్రం బాణాపురం హనుమాన్ టెంపుల్‌లో శనివారం విజయ్‌కుమార్ బజాజ్ ఆధ్వర్యంలో గోపాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోషాలలోని ఆవులకు పూజలు చేసి, 33 కోటోల దేవతలను పూజించారు. కాగా, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ ఆధ్వర్యంలో చంపక్‌హిల్స్ న్యూ క్రియేషన్ పాఠశాల ప్రాంగణంలోని గోశాలలో గోవులకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, చంద్రశేఖర్, కిరణ్మయి, దేవాలక్ష్మి, శైలజ, పుష్యమిత్ర, భాను, ఆది, జవహర్ పాల్గొన్నారు.

గోమాతకు పూజలు

పాలకుర్తి టౌన్: కార్తీక మాసంలోని అష్టమి తిథిని పురస్కరించుకుని మండల కేంద్రంలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులకు పూలతో అలంకరించి, దూడలతో సహా గోమాతకు నైవేద్యం సమర్పించారు. పశువులకు రక్షణ, పుష్టి కలిగించాలని, గోమాతను పూజించడం వల్ల కుటుంబంలో సిరి సంపదలు, ఆరోగ్యం, శాంతి కలుగుతాయని అర్చకుడు డీవీఆర్‌శర్మ తెలిపారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న మంద కుమార్

రఘునాథపల్లి: ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల మండల కమిటీ నిర్మాణంలో భాగంగా ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుక వచ్చిన తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. బొడ్డు దయాకర్, వేల్పుల సూరన్న, కొయ్యడ మల్లేష్, కుమార్, కిషోర్, రాజశేఖర్, మహేష్, ఉదయ్, సురేందర్ పాల్గొన్నారు.

'ఉద్యోగ నియామకాలు నిలిపేయాలి'

లింగాలఘణపురం: ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపి వేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల మండల నూతన కమిటీ ఎన్నికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ అధికార ప్రతినిధి సందెన రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలేదని, ఇప్పటికే 11వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశాడని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ 30ఏళ్లుగా చేసిన పోరాట ఫలాలు జాతికి అందకుండా కుట్ర చేస్తున్నారని, రాబోయే రోజుల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సమరానికి సిద్ధం కావాలని కోరారు. డిసెంబర్ 21న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధ ప్రదర్శన నిర్వహిస్తుందని, విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు దయాకర్, సూరన్న, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, రవీందర్, గడ్డం సోమరాజు, నల్ల లాజర్, రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

జనగామ రూరల్: కారు-క్రూజర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండలంలోని యశ్వంతాపూర్ జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఓ కుటుంబం కారులో హనుమకొండకు బయలు దేరింది. యశ్వంతాపూర్ జంక్షన్ వద్దకు రాగానే జనగామ వైపు వస్తున్న క్రూజర్ వాహనం బలంగా ఢీకొనడంతో పల్టీ కొట్టింది. కారులో ఉన్న శ్రీరంగం శృతి, శ్రీను, సాయి, అంధ్య శ్రీ, శృతికి గాయాలయ్యాయి. కాగా, క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. క్రూజర్ డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే పారిపోయినట్లు తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

లక్ష్మక్కపల్లి శివారులో..

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పండుగ నవదీప్, నర్ర శివలు పాలకుర్తి నుంచి లక్ష్మక్కపల్లికి బైక్‌పై వస్తుండగా గ్రామ శివారులోని దుర్గమ్మ గుడి వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానికులు హనుమకొండకు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఆలేరురూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కందిగడ్డ తండా శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా సిద్దెంకి గ్రామానికి చెందిన వీరబాబు, లవరాజు శనివారం ద్విచక్ర వాహనంపై భువనగిరికి వెళ్తున్నారు. ఆలేరు మండలం కందిగడ్డ తండా శివారులోని రాగానే వెనుక నుంచి కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబు తలకు తీవ్ర గాయాలు కాగా జనగామలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. లవరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరబాబు తండ్రి సూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు.